

# శ్రీకరములు స్వాతి ముత్యాలు

ఉమ ఇయ్యుణ్ణి

# శ్రీకరములు
# స్వాతి ముత్యాలు

ఉమ ఇయ్యుణ్ణి

# శ్రీకరములు
# స్వాతి ముత్యాలు

రచన: **ఉమ ఇయ్యుణ్ణి**

© All rights reserved by the author
written permission through the email is required for
public usage of any of the lyrics either in part or full.

చిరునామా:

**Dr. Uma Eyyunni**
2306, Westview Terrace,
Martins Burg, West Virginia,
2501. U.S.A.

www.pranavamusic.com
email: eyyunni@yahoo.com

**Price: ₹ 50/-**
**$ 5**

ముఖచిత్రం: బాపు

D.T.P.:
**V. Asha Rani**
Musheerabad, Hyderabad.
Ph: 868 664 5226.

Printed at:
**Kala Jyothi Proces Limited**
1-1-60/5, R.T.C. Cross Roads,
Musheerabad, Hyderabad-20.
Ph: 040-27612337, 27612346.

# అంకితం



అమ్మ - నాన్నగార్లకి,
నేస్తానికి, కలల నెచ్చెలికి,
చిన్ననాటి చెలిమికి
నిజ జీవన సహచరికి
(ర)సహృదయులకి

**- ఉమ**

# శ్రీకరముల స్వాతిముత్యాలు

తొలకరి చినుకు ముత్యమై, స్వచ్ఛమైన సత్యమై సృష్టినలరించునట్లు, మనసు లోతులనుద్భవించి, అశ్రువై, అక్షరమై, కవితయై పొంగిన మమతలు, మోడువారిన బీడులు పల్లవించిన తలిరాకులై, విశ్వ వేదికపై నర్తించు పరమేశు కాలి అందియలైన నృత్య నాటికలు కలసి కలబోసిన సంకలనమిది.

ఆత్మాశ్రయ కవితల నుండి నృత్య నాటికల దాకా పయనించిన గత నాలుగు సంవత్సరాలు నా జీవితంలో అపురూపమైనది. నేర్చుకున్న నాలుగు భాషలలోను, భావ వ్యక్తీకరణ చేయగలిగిన సదవకాశం కల్పించిన సాహితీ సరస్వతికి కవితాంజలి.

వేస్తున్న చిన్నచిన్న అడుగులకే పులకరించిపోయి, ఆమోదించి, ఆసరానిస్తున్న నేస్తాలు చక్రపాణి, వై. రామకృష్ణారావు, శేషగిరిరావులకు స్నేహాంజలి.

అత్యంత ఉత్తమ స్థాయినందుకున్న చిత్రకారులు శ్రీ బాపు, అడగగానే అంగీకరించి నా 'గాలి పల్లికి' ముఖచిత్రమేకాక, ఈ సంకలనానికి కూడ తన రేఖలు తీర్చిదిద్దినందులకు నమస్సుమాంజలి.

అర్ధరాత్రి నిద్ర మధ్యలో లేచి దీపం వెలిగించుకుని కాగితం కలం పట్టుకున్నా అర్థం చేసుకుని ప్రోత్సహించే జీవన సహచరి డా. రామానుజంగారికి మమతాంజలి.

తెలుగు భాష మాట్లాడడమే తప్ప వ్రాయడం రాకపోయినా, వివరిస్తే విని అర్థం చేసుకుని ఆనందించే చిరంజీవులు శ్రీకర్, స్వాతులకు శుభాసీస్సులు.

అక్షరం, అక్షరం వెనుక ఒక ఆత్మీయత ప్రతి కవిత వెనుక ఒక మమత. ఈ రూపాలకి పేర్లు పెట్టలేను, ఆ బంధాలకి విలువ కట్టలేను. అందుకే ఒక్కమాటలో 'నేను'గా నిలిచిపోవడానికి దోహదమైన ఆప్తులకు, స్నేహితులకు, ఈ చిన్ని పుస్తకం, అక్షరాంజలి.

- ఉమ

# సాహితీ ముత్యాలు

శ్రీకరముల స్వాతిముత్యాలు ఉమ కలం జాలువార్చిన సాహితీ ముత్యాలు. ఇవి మెరుగులీనే శ్వేతమౌక్తికాలే కాదు, నడకలు, నటనలు, పలుకలు, హొయలు నేర్చిన భావనా ముత్యాలు. ఇది ఏడు నృత్య నాటికల సంకలనం. 'పౌలస్త్య పరాభవం' రామాయణ సంబంధి. 'కర్ణచరితం' భారత గాథ, 'సత్యభామ విజయం' కృష్ణ నాయకం కాబట్టి భాగవత సంబంధిగా చెప్పుకోవచ్చు. 'నమామి సతతం లాస్య లలితం' దేవీ భాగవత సంబంధి. ఇలా మన ప్రధాన పురాణేతిహాసాంతర్గత గాథలు ఈ నృత్యనాటికల ఇతివృత్తాలైనాయి.

ఉమ భాష ప్రౌఢ సుందరం - శైలి లలిత భావబంధురం. అష్టవిధ నాయికలను, నవరసాలను కూడా ఇతివృత్తాలుగా తీసుకొని నృత్య నాటికలుగా రచించడం ఒక అపూర్వ ప్రయోగం. విశ్వవిభుణ్ణి నాయకుణ్ణి చేసి, అష్టవిధ నాయికలను అతని చుట్టూ పరిభ్రమించే పాత్రలుగా చేసి, వారి ప్రవర్తన ద్వారా ఏతన్నాయికల లక్షణాలను అభివ్యక్తం చేయడం శాస్త్రానికి కావ్య రస గంధానులేపనం చేయడమే. 'రసమయం రామాయణం'లో రామాయణ మహా కావ్యంలో ఏ ఘట్టాలలో నవరసాలు పరిపుష్టం చేయబడ్డాయనే పరిశోధనాంశాన్ని కవితామయంగా, దృశ్యరూపకంగా రూపొందించడం ఉమ సృజనాత్మక గాఢత్వానికి నిదర్శనం. ఈ నృత్య నాటికలలో ఎడనెడ తారసపడే సలక్షణమైన, సరళ సుందరమైన తేటగీతులు కవయిత్రి పద్య రచనా పరిణతకు నిదర్శనం. తిశ్రయ, చతురస్ర, ఖండ, మిశ్ర గతులలో సాగిన గేయాలు ఉమ సంగీత పరిచయానికి, తాళ జ్ఞానానికి నిదర్శనం.

కవి దృష్టి రసదృష్టి - పల్లవం నుంచీ పాషాణం వరకు కవికి అన్నీ కవితా వస్తువులే. అతడొక భావనా స్పర్శవేది. గహనమైన సాంకేతిక విషయాలను, గూఢమైన వైదాంతిక విషయాలను కూడా రసవంతమైన కావ్యంగా అవతరింపజేయగలడు. ఈ గ్రంథంలో ఉమ చేసిన ఘనకారం అదే! సాధించిన విజయం అదే!!

**- వై రామకృష్ణారావు**, హైదరాబాద్

# విషయసూచిక


1. పౌలస్త్య పరాభవం .......................... 1
2. కర్ణ చరితము .................................. 20
3. అష్ట విధ నాయికా - ఏకో నాయకః ... 25
4. రసమయం - రామాయణం ............. 34
5. సత్యభామా విజయం ...................... 39
6. నమామి సతతం లాస్యలలితం!! ....... 53
7. మన్మథ జననం ............................... 60

# పౌలస్త్య పరాభవం

**రావణాసుర తపస్సు:**

రావ: ఓం పరబ్రహ్మణే నమః

ప॥ వారిజాసన వేడ వచ్చితి, కోరి నీదరి చేరి నిల్చితి

అ॥ప॥ ఘోర తపములు చేయనెంచితి
ఏలజగములు నేడె దలచితి

ప॥ వారిజాసన వేడ వచ్చితి

చ॥ వేదముఖుడవు వాణిసఖుడవు
వరములిచ్చెడి కల్పతరువువు
గావవేనను కమలభవుడా
బ్రోవవేనను ఆదిపురుషా

ప॥ వారిజాసన వేడ వచ్చితి

రావ: ఓం పరబ్రహ్మణేనమః

**బ్రహ్మప్రవేశం**

ప॥ సంతసించితి దానవేంద్ర, సంతులమ్మిక ఆపవేల

అ॥ప॥ అదరె జగములు నీదు ధాటికి
ఘనము తపమది ఆపు నేటికి

ప॥ సంతసించితి దానవేంద్ర

చ॥ మనసున కలిగిన, కోరిక తెలుపుము
ఒసగెదవరమది అసురుడ నీకిక
కైకసి తనయుడ! తపమికచాలును
కైవసమయెదను కరుణతొ చాటుచు

ప॥ సంతసించితి దానవేంద్ర
నరవానరులుగాక ఏచరులు గాని
నను హతము చేయగ వీలుగాని
వరమొసగి బ్రోవవె ముదముమీర
కరుణ చూపవె నాదు మనసు తీర

**ఓం పరబ్రహ్మణే నమః**

ఒసగితి జగముల నిండిన కలిమియు
అమరుల పదవుల మించిన బలిమియు
మృత్యువు చేరని అమృత భాండము
కుక్షిన పొసగెద రక్షగా నీకిక

ప॥ సంతసించితి దానవేంద్ర

తే॥గీ॥ చేరికొల్వగ నీ దరిచేరికావ
వేడ నీడితివి వరములు వేగనాకు
తీరె నాదగు కోరిక దేవ నేడు
ధన్యనైతిని నీ దయ ధర్మతేజ

**రావ:**

ప॥ పదునాల్గు భువనాల నాసరి సముడు
కనరాడు కనరాడు నా సాటి రేడు

అ॥ప॥ దివిలోన భువిలోన నాబోటి వీరుండు
ఎటు చూడ సరిరాడు సమరాన సరిజోడు

ప॥ పదునాల్గు భువనాల నాసరి సముడు
కనరాడు కనరాడు నా సాటి రాడు
పదునాల్గు భువనాల నాసరి సముడు

చ॥ అమరేంద్ర ఇక మీద నీ పదవి నాది
అచ్చరలు కిన్నెరలు కొనగోటిపాటి
వ్యర్థ యత్నము మాని దాసోహమనుము
ఇంద్ర పదవిని వీడి నా మ్రోల నిలువుము ॥పదునాల్గు॥

మండోదరి

ప॥ మండోదరిని నేను మయరాజ పుత్రిని
మధు కలశమును బోలు, మందహాసము నాది

అ॥ప॥ హొయలొలుకు రాయంచ నడక నాది
ముదమలరు ఆమని సొబగు నాది ॥మండోద॥

చ॥ లంకాధిపతియట రావణాసురుడట
సుందరుల మదిగెల్చు అపురూపమరుడట
సౌందర్య రాశినేనపర రతిగాన
కెం జాయ చాయలో పతిని కనుగొనన ॥మండోద॥

రావ:

ప॥ మదన బాణము బోలు మానిని ఎవరీవు?
కదలు మీనుల తీరు చూపుల విసిరేవు!

అ॥ప॥ మొయిలు దారుల దాగు, మేలిమి మెరుపువా?
హొయలు చూపెడు రేయి తారల తళుకువా?
మదన బాణము బోలు మానిని ఎవరీవు
కదులు మీనుల తీరు చూపుల విసిరేవు
మదన బాణము బోలు మానిని ఎవరీవు

చ॥ లలిత యామినిలోని కలువరాణివ ఏమి
చలిత హరిణము బోలు తరుణ భామినివ ఏమి
ఇలను వెలసినట్టి మేటి సురకామినివ ఏమి
మనసు దెలుపవె నేడు మధురమోహినివేగ ॥మదన॥

తే॥గీ॥ తరుణి నా మది రంజిల్ల దయను జూపు
రాగభావము నిండగ రసమయముగ
సరసముగ చేర రావె ఓ చంచలాక్షి
నాదు రాణివై లంకలో నలరవలదె

**మండో**

తే॥గీ॥ ఆకుమరుగున దాగిన అలరువోలె
నాదుమనసును నీకిడ నయముగాను
తండ్రి చాటున పెరిగితి దానవేంద్ర
కాన జనకుని అనుమతిన్ కరము బట్టు

**రావ**

ప॥ జయము నీకిదె మయరాజ
కొనుము దశకంఠు వందనమ్మిదె

అ॥ప॥ మనవిని విను నీ తనయను గోరితి
నీయానతిచే పరిణయమాడెద ॥జయము॥

చ॥ లంకాధీశుడ దశకంఠుడను
జగమునాదను భీషణుండను
అమరజనులకు భీకరుండను
కుంభకర్ణుని సోదరుండను ॥జయము॥

చ॥ బ్రహ్మదేవుడే వరములొసగెను
మహాదేవుడే మహిమలిచ్చెను
చెలగి జగముల నేలు వాడను
వలచి నీ సుతను కోరువాడను ॥జయము॥

**మయుడు**

శుభమస్తు జయమస్తు కల్యాణమస్తు
పుత్రపౌత్ర సంవృద్ధిరస్తు
**అందరూ నిష్క్రమించుచుండగా**

**భటుడు**

తే॥గీ॥ స్వామి నేనెటు తెల్పుదు సార్వభౌమ
నీదు సోదరు దుర్భాష నీచ ఘోష
అల్క ఏలిక పల్కెను ఔర వినుము
నీదు గర్వము కూల్చ తా నేడు తలచె

**రావణ**

ఔర ఏమది దర్పము యతని మదము
చూప సహనము నేనిక చూపదయను
ఇదియె ప్రతినను చేసెద ఇపుడె నేను
చీల్చి వానిని నరకము చెర్తు నిపుడే

నిష్క్రమణ

## కుబేరుని కొలువు

ప॥ అలకానగరపు టేలిక నేను
అమరేంద్రుని సరి వీరుడ నేను

అ॥ప॥ అరివీరుడు దశకంఠుని భ్రాతృడ
యతని మదమణగనణచి వేసెదను ॥అలకా॥

చ॥ భువనము గగనము విహరణ చేసెడి
అద్భుత పుష్పక వాహన మలరగ
నరులును అమరులు కలగను ధనముల
కధిపతినే నే కుబేరుండను ॥అలకా॥

## రావణ ప్రవేశం

ప॥ అన్నవనుచు గారవించితి
చిన్నబుచ్చెద వేమి గర్వము

అ॥ప॥ అలకపురిని కేలు చివరన
నలగగొట్టెద కాచుకొనుము ॥అన్నవనుచు

చ॥ మూడు లోకము లెందుగూడను
నాకు సముడగు వీరుడెవ్వడు
పరమశివుని పరమ భక్తుడు
నాకు ఎదురగు ధీరుడెవ్వడు ॥అనవనుచు॥

చ॥ వదలి దర్పము యొదిగి యుండుము..
ఎదురునిల్చిన చీల్చివేసెద
వదలి దర్పము యొదిగి యుండుము
ఎదురు నిల్చిన చీల్చివేసెద
అన్నయైనను తమ్ముడైనను
లంక ఏలిక ముందు శూన్యము

ప॥ అన్నవనుచును గారవించితి
చిన్నబుచ్చెద వేమి గర్వము
**యుద్ధం**

**కుబేరుడు పారిపోయిన తర్వాత**

**రావణ:**

తే॥గీ॥ మరలిరాడిక కుబేరుం డలకపురికి
రావణాసురుతోడనారణమతనికి
మనదిగా పుష్ప కమ్మిక మంత్రులార
సకల లోకాలు గెల్వగ సమయమాయె

**రావణుని నిష్క్రమణ**

**కైలాసము**

ప॥ సాగుచుండెను తాండవమ్మది
రాగరంజిత శాంభవమ్మది

అ॥ప॥ మ్రోగకింకిణుల నాథఝురులవె
సాగెతాండవపు నాట్యవిధులవె ॥సాగు॥

చ॥ హరుని పాదమది తక్కిటయనగా
గిరిజమోదమకి తద్ధిమియనెను
భవునిమోహము ముదము మీరగ
తరుణిమోమది అరుణమాయెను ॥సాగు॥

చ॥ అతని పదమది అవని తాకెను
ఆమె పదములు అతని చేరెను
కలసి నాట్యము ప్రణయమాయెను
మొరసి నాదము ప్రణవమాయెను ॥సాగు॥

చ॥ కలిసి ఆడిరి కలిసి పాడిరి
మురిసి చూడగ సకలలోకములు
ప్రణయ తాండవ ఖేల చెలగగ
ప్రకృతిమోహన లీలకరుగగ ॥సాగు॥

చ॥ గగన తలమది, వెలిగిపోయెను
శివుని శిరముపై శశియు నాడెను
మరులు విరియగ నగజ ఆడెను
నగవు మెరయగ భవుడు ఆడెను ॥సాగు॥

సాగుచుండెనూ తాండవమ్మది - రాగరంజిత శాంభవమ్మది
సాగుచుండెనూ తాండవమ్మదీ - రాగరంజిత శాంభవమ్మదీ...

**రావణుడు నందితో**

గెల్చి వచ్చితి కుబేరు గీరమణచి
చూడమనసాయె నా జటాజూటధరుని
తెల్పు నా రాక ఆ పార్వతీశునకును
అభవుగాంచగ బోనిమ్ము ఆశదీర

**నంది:**

ఆగు రావణ ఇది వేళ అసలు కాదు
గిరిజ తోడుత భవుడేమొ గిరిని నిలచె
పోవజాలదు అటునీవు పోకు సుమ్మి
పోవ దల్చిన మన మధ్య పోరుజరుగు

**రావణ**

ఏమి అహమది కపిముఖ నికనుతొలగు
క్రోధ మెగసెన కోపాగ్ని లోనత్రోసి
దునిమి అంతము చేసెద ధూపమెగయ
కాచుకొమ్మిది రావణ ఘాతమిదియె

నంది

ఔర నీకిక ముగిసెను ఆయువిపుడు
కోతివలననె గలిగేనె కలత నీకు

రావణ

కదిపి కైలాసగిరులన్ని ఘనబలాన
కనెద గిరిజేసు నీవేళ కన్నులార
(కైలాసం కదుపుట)

**శివుడు రావణుని బొటనవ్రేలితో క్రిందకు తోయువరకు రావణుడు రెండు చేతులు జోడించగానే రావణుడి శివస్తోత్రం**

ప॥ దయగని జూడుము, కరుణతో నేలుము
లంకకు విభుడను, నీదరిబంటును

చ॥ జగములు కరుణతో నేలెడి విభుడవు
హిమగిరి నివసిత గణముల ప్రభుడవు
భవుడవు శివుడవు భవభయ హరుడవు
దయగని అరయగ జన్మము ధన్యము ॥దయగని॥

చ॥ పరి పరి విధముల పొగడగ నెగయగ
పదముల వెదకెద పలుకులు తెలిపెద
రాక్షస కులమున వెలసిన నెపమున
కినుకను చూపకు కరుణను వీడకు ॥దయగని॥

చ॥ సురనది జటనిడి చెలగెడి విభుడవు
గరళము విరసము చేసిన ఘనుడవు
భుజగము మెడనిడి నటనము సలుపుతు
ప్రమథుల గణముల కాచెడి రేడువు

**రావణుడు క్రింద పడగానే శివుడు ప్రత్యక్షం**

శివుడు

తపము మెచ్చితి రావణ ధన్యమవగ
నీకు వరములనిచ్చితి నీతివిడక
మనిన అనుపమ కీర్తి నీ మహినబడయు
నీతి తప్పిన శాపమో నిడిన వరము

రావణుడు నమస్కరించునపుడు తెరప్రాలును

## వేదవతి తపస్సు

| | |
|---|---|
| ప॥ ఓం శ్రీ విష్ణవే నమః | ఓం శ్రీ జిష్ణవే నమః |
| ఓం శ్రీ దేవ దేవాయ నమః | ఓం శ్రీం దీనబంధవే నమః |
| ఓం శ్రీ ఆదిదేవాయ నమః | ఓం శ్రీ పుండరీకాయ నమః |
| ఓం శ్రీ పరమాత్మనే నమః | ఓం శ్రీ పరాత్పరాయ నమః |
| ఓం శ్రీ పరశుధారిణే నమః | ఓం శ్రీ పురుషాయ నమః |
| ఓం శ్రీ హయగ్రీవాయ నమః | ఓం శ్రీ శేషశాయినే నమః |

రావణ

ప॥ పుడమిని పూచిన వెలుగుల రాణివ
కడలిన దాగిన మరకత శ్రేణివ

అ॥ప॥ అడవిని వెలిగిన సౌదామినివా
కనులను జూడగ కనకపు తునుకవ ॥ పుడమి॥

చ॥ అసురుల జగముల అధిపతి నేనిట
అమరుల విభవము నణచెడి ధీరుడ
అతివలు ననుగని మరుడని తలతురు
నగవున పలుకవె మరువపు మొలక ॥పుడమి॥

చ॥ ముసిముసి నగవులు మురిపెపు బిగువులు
విసిరెడు తరుణము తపమది తగదిక
విడుమిక బిడియము నాదరి చేరుము
నిలిపెద ఎదుటన భూతల స్వర్గము ॥పుడమి॥

**వేదవతి**

ప॥ ఆగుమాగుము అసుర రాజా!
కదలి రాకుము తాకబోకుము

అ॥ప॥ కమలనాభుని పతిగ గోరి
తపమునందు నిమగ్ననైతిని ॥ఆగుమాగుము॥

**రావణ**

ప॥ నిలునిలునిలు లలనామణి, నినుతాకగ మనసైనది
నిరుపమ సౌందర్య లహరి కోపాన మరింత రగిలి
నిలు నిలు నిలు లలనామణి

**వేదవతి**

పరకాంతను తాక ప్రమాదమునిక్కము
మరియాద మరచిన మరణమది తథ్యము
మరులుగొననట్టి ఏ మగువను చేకొన్న
మరుక్షణము నీ శిరసు ఖండమ్ములగును

**రావణ**

నిలు నిలు నిలు లలనామణి, నిను తాకగ మనసైనది
నిలు నిలు నిలు లలనామణి

**వేదవతి**

నీవు తాకిన యట్టి ఈ జటను రగిలించి
భస్మమయ్యెద వేగ నిచట నేనిప్పుడే
తిరిగి భూసుతగా జన్మంబు నెత్తి
నీదు యశమునంత సమసిపోవగ జేతు

## రావణ శివస్తోత్రం

1. జటాటవీ గలజ్జల ప్రవాహ పావితస్థలే
గలేవలంబ్యలంబితాం భుజంగతుంగ మాలికాం

డ్డమడ్డమ డ్డమ డ్డమ న్నినాదవ డ్డమద్వయం
చకార చండ తాండవం తనోతునశ్శివం శ్శివం

2. జటాకటాహసంభ్రమద్భ్రమ న్నిలింప నిర్జరీ
విలోల వీచి వల్లరీ విరాజమానమూర్ధనీ
ధగధగ ధగజ్జ్వల ల్లలాటపట్టపావకే
కిశోర చంద్రశేఖరే రతిః ప్రతిక్షణం మమ

3. ధరాధరేంద్ర నందినీ విలాసబంధ బంధుర
స్ఫురద్దిగంతసంతతి ప్రమోదమాన మానసే
కృపా కటాక్ష ధోరణీ నిరుద్ధ దుర్ధరాపతి
క్వచిద్దిగంబరే మనో వినోద మేతు వస్తుని

4. ప్రపుల్ల నీలపంకజ ప్రపంచ కాలిమచ్ఛటా
విడంబి కంఠ కంధరా రుచి ప్రబంధకంధరం
స్మరచ్ఛిదం పురచ్ఛిదం భవచ్ఛిదం మఖచ్ఛిదం
గజచ్ఛిదాంధకచ్ఛిదం తమంతకచ్ఛిదం భజే

5. అగర్వ సర్వమంగళా కళా కదంబ మంజరీ
రస ప్రవాహ మాధురీ విజృంభణా మధూవ్రతం
స్మరాంతకం పురాంతకం భవాంతకం మఖాంతకం
గజాంతకాంధ కాంతకం తమంతకాంతకం భజే

రావణ

ప॥ ఇది ఏమి విధిలీల ఈ వింత సుమబాల
బంగారు కమలాన రంగారు పసిబాల

చ॥ హతవిధి ఈ బాల నా కలను వాపముగ దోచె
అలనాటి వేదవతి ఈ రూపముగా జనించె
అవనిజ నరుదెంచె లంక కికను కీడు జరుగుసుమ్ము
అసురులంత సమయుట నిక మీద జరుగుత తథ్యమ్మిది

॥ఇది ఏమి॥

పద్యం: పాప మోయన లంకేశు పాపరూపె
పువ్వునందున పుట్టిన పొలతి ఈమె
వేల యోజన దూరాన వేగమికను
పారవేయుడు కడలిన భయము లేక

**రావణుడి నిష్క్రమణ**

## జనకుని యాగభూమి

**శతానందుడు**

నీళ్ళు చల్లగానే
సస్యశ్యామల మీనేల సాగుచేయ
ఇష్టకార్యము సిద్ధించు ఈశునాన
తలచికులదైవ నామము ధరను దున్ను
కలుగు సంతతి నీకిక కోర్కె తీర

**జనకుడు: గురువర్యా**

ఆదిలక్ష్మియె మనకొరకవని వెలసె
చూడరారమ్మ గురువర శుభము కలిగె
సీతనామము మీయాన సిద్ధికాగ
జగతి వెలిగేను ఈ బాల జయము గలుగ

## సీత ప్రవేశం

ప॥ మీనలోచని నేను మిథిల పుత్రికను
భూమి సుతను నేను పుణ్యసంజాతను

అ॥ప॥ మానినిలోకాన మణిపూసను నేను
భూమిసురులకు నిత్యపూజితను నేను ॥మీన॥

చ॥ అయోనిజను నేను అసురనాశిని నేను
పయోనిధి నెలవైన పద్మాక్షి నేను
అలసోముని అనుగు సోదరిని నేను
జనకుని పుత్రికను జానకిని నేను

## సీత చెలులు

ప॥ విరితోట పిలిచెనె, చెలులారా పలుకరె
విరిజాజి జలజల, విరులన్ని కురిసెనె

అ॥ప॥ పగడాల హొయలుతో మందారమొకటది
పున్నాగ నీడలో దోబూచులాడెనె ॥విరితోట॥

చ॥ తెలిమబ్బు దిగివచ్చి నయనాలు మూయగ
తలిరాకు తల్పాల సిరిమల్లి నవ్వగ
నళినాక్షు కథలన్ని విరిబోణి తెలుపవె
తనువెల్ల వీనులుగా విరులన్ని వినవటె ॥విరితోట॥

చ॥ పూబోణి నీవిక వేయవే పూబంతి
ఆడుదుము మనసార హాయిగా బంతాట
అరె అరె అరె అటుచూడు ఆ బంతి దొరలెనదిగో
అయ్యయ్యో ఎటులమ్మ జరిపితివి శివధనుస్సు ॥విరితోట॥

## తాటక సంహారము

ప॥ తాటకి యను రాక్షసిని నేను
ఘాతకములను చేసెద నేను

చ॥ ముల్లోకమ్ములు గడగడలాడగ
తాపసులందరు తల్లడిల్లగ
మునులను ఋషులను కరకర నమిలెద
క్రతువులు సమసెడు రీతుల గెలిచెద ॥తాటకి॥

చ॥ పుత్రులిద్దరు మేటి వీరులు
రక్కస జాతికి మేరు ధీరులు
కర్కశ రీతిన కఠిన శిలలను
త్రొక్కిడి చేసెడు ఘనులు శూరులు ॥తాటకి॥

ప॥ ఆకలిగొంటిని ఆవురుమంటిని
ఏవురునరుల చూరగ గొంటిని

అ॥ప॥ అడవి దారుల నిర్భయ రీతిని
నడచిపోయెడు నరులగంటిని ॥ఆకలి॥

చ॥ జందెపు పోగులు జడలు నారలు
విందుగ కానెడు విప్రుడు తోడుగా
అందపు బాలురు అడవిదాటగ
విందులు నాకిక పండుగ రోజిక ॥ఆకలి॥

చ॥ ముద్దుల మోములు వద్దిక నడకలు
అద్దరి వేల్పుల గెల్చెడి వీరులు
ఇద్దరు రాజులు ఒక్కడు గురువు
భళరే విందిక అందెను పొందుగ ॥ఆకలి॥

విశ్వా రామ వినుమిది పాపముల్ రాశిపోసి
పోగు చేసిన రాక్షసి పోరుసల్పి
ఒక్క బాణాన తెగవేయు రక్కసినిక
మునుల బాధలు తొలగును ముదము మీర

రామలక్ష్మణులు

ప॥ మునివర వినుమిది మనసున మధనము
సల్పుట ఎటులది అబలల వధను

అ॥ప॥ తెలిసిన చదువులు తెలిపిన విధములు
తగవని పలికెను అబలతో రణములు

చ॥ క్షాత్రవ నీతులు స్మృతులు శాస్త్రములు
వలదని తెల్పెను వనితతో పోరులు
ఎటుల దునిమెదము మనసువలదనగ
దయగొని తెల్పుము తాటకి వధ విధి ॥మునివర॥

విశ్వా

పద్యం: కాదు పాప మధర్మము కాదు వినుడు
చేయ ఘాతకము అబలైన శిక్షకర్హు
లగుట, న్యాయము, ధర్మము అదియె నీతి
శంక పోద్రోలి తాటకిన్ సంహరించు

విశ్వా

యజ్ఞయాగములు భగ్నమొనర్చెడి రాక్షస గణములు అంతరించెను
సత్త్వ పురుషులు, ఋత్విజవరులు, సంతసమొందెడి
సమయంబాయెను.

చ॥ అద్వితీయమది అవనిజ చరితము, ప్రకటితమాయె
స్వయంవరము
చూడవేడుకగ రాజకుమార, వెడలెద మిప్పుడె రఘువీర
శివచాపమ్మది ఎక్కుపెట్టగ, సకల జనంబులు సంతసింపగ
మిథిలానగరపు రాచపుత్రిక, సాకేతమునకు అగును దీపిక

**అందరూ నిష్క్రమణ**

## రావణ సభ

**మంత్రుల పరాకులు**

1. అనర్ఘమణి రమణీయ కిరీట రత్నకుండలాం గద
గ్రై వేయాది వివిధ భూషణ, దివ్యాభరణ విభూషితా,
తటిల్లతా సహిత ఘనాఘన వితానా
జయీభవ దిగ్విజయీభవ

2. సకల సురమదగర్వభంజనా - జయీభవ దిగ్విజయీభవ

3. రాక్షస వంశపయః పారావార రాకాసుధాకర
లంకాధీశ్వర శ్రీశ్రీశ్రీ రావణాసుర సార్వభౌమ
దశకంధర, జయీభవ దిగ్విజయీభవ

**రావణ**

ప॥ నేనే సమస్త జగములకేలిక
నేనే విశిష్ట దైవము మీకిక

అ॥ప॥ ఇంద్రుడు చంద్రుడు, సూర్యుడు గురుడు
కొలువు తీర్చి నను కొలువగ వచ్చిరి ॥నేనే॥

చ॥ అడుగో చూడుడు ఆకొన దాగెను
అమరభూపతి కానక మరుగతి
ఆకస మంటెడు సౌధము నాదది
నా సభ మెరిసె దివ్వెల వరుసది ॥నేనే॥

చ॥ మొదటి దీపము ఇంద్రుని పదవి
పిదప వచ్చెను సోముడు అదరి
అష్టదిక్కులను నేలెడి రాజులు
ఇచ్చట నాకడ ఇకను దాసులు ॥నేనే॥

**భటుడు రావణునితో**

పద్యం: తన తనయయగు సీతకై ధరను వెదకి
శంభుచాపమ్ము నెత్తాడు శౌర్యధనుకై
చాటెగా స్వయంవరమును జనక విభుడు
పిలువ తలపడు నీ బోటి పృథ్విపతిని

**రావణ**

ప॥ ఎటుల సైచెదను జనకుని దర్పము
నన్నే పిలువని ఆతని ధైర్యము ॥ఎటుల॥

చ॥ ధూర్తుడు కాడు ధూర్జటి బంటు
కాడుభీరుడు కాలుని సముడు
రావణరాజును రాక్షస తేజము
రాజిల వెలుగుదు రాజ్యములందు ॥ఎటుల॥

చ॥ జనకుని కెంతటి మనోగర్వము
వెడలెద మిధిలకు అదరగ జగము
రావణు పిలువని స్వయంవరమ్మును
భిన్నము చేసెద నిదియె శపథము ॥ఎటుల॥

**రావణుడు నిష్క్రమించును**

## సీతాస్వయంవరము

జన ఈమె నా సుత తానెత్తె ఈశు విల్లు
మాదు వంశాన వెలసెను మహిమ దనర
నాదు పుత్రిక చేయంద నారిసాచి
నిలచి ఈ సభ వెలుగొంద నేడు రండు

రాజు జనక ఏమిది ఇది ఇంద్రజాలమయెన
చాపమెత్తెద గోటితో క్షణములోన
చూడు శోభిల్లు ప్రతిబెల్ల క్షోణి తలము
సీత గెల్చెద జనులెల్ల సేసలిడగ

**ఎత్తలేక క్రింద పడును**

రాజు విల్లునెత్తగ ఈ రాజు విఫలుడాయె
చాపమెత్తగ నేరని శౌర్యమనగ
కనుము మహరాజ అసమాన కార్ముకమును
నేను సాధించి గెల్చెద నీదు తనయ

**ఎత్తలేక పారిపోవును**

రావణుడు

ప॥ జనకుడ నీసుత గెల్వగ వచ్చితి
పిలువని నేరము నీదని తెల్పితి

అ॥ప॥ హరునికి అనుపమ భక్తుడ తెలియుము
కపర్దిచాపము రావణు భాగ్యము ॥జనకు॥

చ॥ నగవుల మోమున నెలతను కనుగొన
సొగసుల అవనిజ వలపుల గెలువగ
పిలవక వచ్చితి ప్రతిభను తెల్పగ
జగములు చకితము చేసెద కనుమిక

ప॥ జనకుడనీ సుత గెల్వగ వచ్చితి
పిలువని నేరము నీదని తెల్పితి

**రావణుడు విల్లునెత్తి క్రిందబడును**

**రావణ**

తే॥గీ॥ పాపమిది తాక దైవమౌ భవుని విల్లు
తాళ జాల నీ అవమాన దగ్ధ ఘటన
కదలెద నిపుడు తరుణిని వదలకల్ల
భావి చరితన లంకేసు భామయవగ

**రావణుని నిష్క్రమణ**

**రాముడు విల్లునెత్తును**

జానక్యాః కమలామలాంజలి పుటేయి యా పద్మరాగాయితా
హ్యస్తా రాఘవ మస్తకేన విలసత్ కుందప్రసూనాయితా
స్రస్తాశ్యామల కాయకాంతి కలితా యా ఇంద్రనీలాయితా
ముక్తా స్తాశుభదాభవంతు భవతాం శ్రీరామ వైవాహికాః

**- తెర -**

# కర్ణ చరితము

## కురుక్షేత్రము

నేపథ్య వచనం: కృష్ణరాయబారము విఫలమై, కురుక్షేత్రమున రమణారంభమయి, శ్రీకృష్ణుని గీతాబోధ సాగి, అర్జునుడు భీష్మాచార్యుని అంపశయ్య అలంకరింపజేసెను. ఆ పిమ్మట ద్రోణాచార్యుని మృతి తరవాత, కర్ణుని సేనాధిపతిగ నియమించెను సుయోధనుడు. కర్ణుడు రథసారథ్యమున వాసుదేవ తుల్యుడగు శల్యుని కోరిన విధంబెట్టిదన...

**కర్ణుడు - శల్యుడు: ప్రవేశం**

**కర్ణుడు**

ప॥ వందనము, వందనము మద్రదేశ మహరాజ
గైకొనుము, రాధేయుడు నీకిడు వందనము.

చ॥ పార్థురథముతోలు పార్థసారథి సముడు
మెలకువగ రథము మరలించు ఘనుడు
మద్రదేశపు రాజు మహిపతి శల్యుడు
అని తెలిసి వేడితి చేయునా సారథ్యము

**శల్యుడు**

ప॥ అటులనే కానిమ్ము, అంగరాజ, కర్ణుడ
కాని విను హితము చెప్పెదను నిక్కము

చ॥ కపి రాజు ధ్వజముపై ప్రభవించువాడు
కరిరాజు గర్జనల ఘోషించువాడు
ఘాతముల శత్రుల దండించువాడు
గాండీవము నెత్తి వెలుగొందువాడు

చ॥ దేవదత్తము నూది దేవతల భయపెట్టి
పాశుపతమ్ము కోరి పరమేశు పూజించి

దేవేంద్రు కృప తోడ ధరనుద్భవించి
కౌంతేయ డరుదెంచు కృష్ణ సారధ్యమున

చ॥ సూతపుత్రుడ వీవు శూరధనుడవె కాని
ధర్మమెరుగని దుర్యోధను మైత్రి చేసి
అధర్మ యుద్ధాన అరివీరు చేతుల
అమరగతి పొందెదవు, అంగరాజ కర్ణ!

కర్ణుడు:

అటులనె కానిమ్ము, అవనీశ నీ మాట
కర్తవ్యము నాకిక సేనాధిపత్యము
చేసిన కరుణను శల్యసారథ్యము
చేసెద యుద్ధము శక్తిమేరకును...

ప్రవేశం కృష్ణార్జునులు:

కర్ణుడు: తరలింపు రథము పార్థుని దిశను
ఆహవమున అతనొకడె నాదు గమ్యమ్ము
కాచుకొను అర్జునా, నాదు ఘాతమ్ము
వేసెదనిపుడే అమోఘమౌ నాదు అస్త్రమ్ము

అర్జు: ఆగుమాగుము అంగరాజ
కాచుకొనుము ఘోరశరము
నేడు మూడును నీకు ఆయువు
నేను తీర్చగ నాదు శపథము

**అంతలో కర్ణుని రథం ఒక ప్రక్కకు క్రుంగును...**

కర్ణుడు: ఒకపరి ఆగుము, ఒకపరి ఆగుము
రథచక్రమ్ము ఒరిగెను చూడుము
తాళుము క్షణము దిగితిని రథము
సరిచేసి చక్రము చేసెద యుద్ధము

కృష్ణుడు: పార్థ! ఏమది, ఈతడు పాపి కాడ!
నీతి నెరిగియు, కర్ణుడు నేల కూల
వేయి బాణము ఇప్పుడె వీర వరుడ
ముగియు యుద్ధము ధారుణి ముదము మీర!

అర్జు: బావ! కాదిది ధర్మము, పాపభీతి
నన్ను వారించె, ఇటులను నాదు కీర్తి
మాయ, కర్ణుని వధియింప మహిని జనులు
పార్థనామము నేడిక పాపమనరె!!

కృష్ణుడు: కాదు పాపము, నీవిటు కర్ణుదునుమ
వేయి తలపక నీవిక వీరు పగిది
వేసి బాణము సమయించు వీరయిపుడె
పోరు చాలిక ధారుణి పుణ్యచరిత...

**అర్జునుడు బాణము వేయుట, కర్ణుడు మరణించుట...**

**కుంతి ప్రవేశం, కర్ణుని మృత శరీరము వద్ద...**

ప॥ మాతృఛాయను వీడి, ధరణి శాయికాగ
ఆకాశమే నీకు ఆచ్ఛాదనయ తండ్రి!

అ.ప. కరుణమాలిన తల్లి గంగలో నిను విడువ
కరుణ వొడిచేర్చెనా మృత్యు దేవత నిన్ను!

చ॥ తండ్రి నెరుగని తనయుడవు నీవు
తరువు వీడిన తలిరాకు నీవు
గాలివాటు సోలి, నేలరాలిన తండ్రి
మర్యాద మాటున మమత వాడినదోయి.

చ॥ మన్నించబోదు మాతృత్వము నన్ను
మన్నించబోదు సృష్టి ధర్మమ్ము
మన్నించబోరు నీ అనుజులెవ్వరును
మన్నించు నీవైన మమత యెండినవాడిని

చ॥ అసువు బాసిన నీకిదె అశ్రుతర్పణము
ఉగ్గుబెట్టని తల్లి చేసె కవోష్ణమజ్జనము
కళ్యాణము చూడలేని నా కన్నీటి సేసలు
మరుజన్మ నీకిడుగాక కన్నతల్లి బాసలు!!

**ప్రవేశం: అర్జునుడు, ధర్మరాజు**

ధర్మరాజు: శత్రువీరుని, కర్ణుని శవమునొద్ద
శోదేవత వలెనిటు శోభ వీడి
కనుల బాష్పము ధారగ కార్చుటేల?
తల్లి తెలుపుమ సత్యము ధరణిలోన.

అర్జు: సూత పుత్రుని దునిమితి శూరుపగిదిన్
తగదు శోకింప నీవిటు; తనయు కీర్తి
తరుగు నట్టుల చేయకు తల్లి నీవు
శోక కారణమేమిటో నాకు తెలుపు.

కుంతి: ఏమని పల్కుదు, ఏవిధి తెల్పుదు
నేలను రాలిన ధీరుడు కర్ణుడు

అ.ప. చేయని పాపము, మోసెను శాపము
ధారుణి కూల్చగ నీదగు చాపము.

చ॥ కన్నియ ప్రాయము కోరిన వరము
రూపును దాల్చెను కర్ణుని నామము
పెదవి దాటనివి పెను మర్యాదలు
ప్రాణము వీడెను పుత్రుడు జ్యేష్ఠుడు!

అర్జు: తల్లి! ఏమది! పలికిన ధర్మమేది?
సూత తనయుడు, రాధేయ, శూరధనుడు
నీదు పుత్రుడ? నేనిటు నీతి తప్పి
అగ్రజుని జంకినాడను ఉగ్రముగను

ధర్మ: వినుమిది ఒసగెద శాపము నేనిటు
మౌనము దాల్చిన మానిని వలన
జరిగెను ఘోరము అగ్రజు ఘాతము
సహనము కాదిది ధారుణి ధర్మము

చ॥ అసువుల బాసెను అమరుల చేరెను
ఆతని దోషము లేనిది ఇది సత్యము
కర్ణుని నామము నిలుచును నిత్యము
భూతల మందున భాస్కరు నాన!

చ॥ నారీమణులకు నోటను నానదు
నువ్వుగింజ యికపై సత్యము
వినుమిది ఒసగెద శాపము నేనిటు
మౌనము దాల్చిన మానిని నేడు!!

కుంతి: మన్నింపు దోషము, మన్నింపు ధర్మజ
మర్యాద మాటున మరుగాయె మమత
బ్రతుకంత శోకమై గడచేను నా తండ్రి
మనసు సంతతము తలచేను వెలితి

చ॥ పరితప్త హృదయము పరిపరి తలచేను
పసిబాలు నొడివీడు కాఠిన్య ధర్మము
రాచనీతి దాటని రాచపుత్రి కర్తవ్యము
కన్నీరు దాచెదు గాంభీర్య భావము

చ॥ జగముల కలుగడు కర్ణుని సముడు
స్నేహము దానము మూర్తియగు మనుజుడు
చరితను నిల్చును కుంతీ సుతుడు
సూర్యుని కృపను వెలిసిన కర్ణుడు!!

# అష్ట విధ నాయికా -
# ఏకో నాయకః

స్వాధీన పతికాచైవ తథావాసవ సజ్జికా
విరహోత్కంఠితాప్రోక్తా, విప్రలబ్ధాచ ఖండితా
కలహాంత రితాచైవ, తథాప్రోషిత భర్తృకా
తధాభిసారికా చైవ మష్టదా నాయికామతా

నాయక ప్రవేశంచ

ప॥ విశ్వవ్యాప్తుడ నేను విశ్వంభరుడ నేను
విశ్వరూపుడ నేను విశ్వనాయకుడ నేను

అ.ప. ఆది అంతము లేని అఖిలాండ జగతిని
ఆలించు పాలించు ఆత్మంబధుడ నేను

చ॥ నీలి గగనపు ఛాయ మేలి కనకాంబరము దాల్చ
మెరసేను మేఘాన మెరుపు కూడిన లీల
కనుదోయి కదలాడ మెదలె నీలోత్పలమాల
కమలాక్షి ననుజూడ వేయు వరమాల

చ॥ అష్టవిధనాయకలనురాగములు చూప
సృష్టి విధులానందకేళియనగ సాగ
స్రష్టకే మోహములొనగూడి వెలుగ
ద్రష్టలు రసానంద డోలలందూగ

తే.గీ. అదిగొ నిలచెను అచటనే ఆమె సాధ్వి
మోము అరుణిమ దాల్చగ మోవినగవు
మెరిసె లజ్జతో వెన్నెల కిరణ మనగ
ఆమె స్వాధీన పతికయై అచట నిలిచె చూడ

**మోదటి నాయక ప్రవేశం**

ప్రియోప లాలితా నిత్యం స్వాధీన పతికామతా
అస్యోస్తు చేష్టాః కధితాః స్మర పూజోత్సవాదయః
వనకేళీ జలక్రీడా కుసుమాపచయాదయః

ప॥ వినవె చెలియ విభుడె పిలచె
కనవె తరుల విరులు పలికె

అ.ప॥ మదను కొలువ మనసు తలచె
కొలను కలువ కనులు తెరచె

చ॥ జలక మాడ తనువు కోర
చెలుల కూడి సరసు చేర
వలపు తలపు విరిసి మురిసె
జలజ చెలియ సరసమాడె

ప॥ పొన్నలు, పొగడ పూలన్ని చేరిచి
వన్నెల విరులు మాలగ కూరిచి
వెన్నుని గళమున శోభల వైచి
వెన్నెల వేళల విహరణ సేయ

**వాసవి సజ్జిక**

ప్రియాగమనవేళాయాం మండయంతీ ముహుర్ముహుః
కేళీ గృహాంతధాత్మానాం సాస్యాద్వాసక సజ్జికా

**దూతికల ప్రవేశం:**

ప॥ ఆగవేమె సఖీ, ఆతురమేలనే
ఆతని రాకను ఆమని తెలుపదే

అ.ప॥ సఖుని రాకకు సమయమాయెనే
నఖశిఖము మేము పులకలాయెనే

చ॥ ముందు వాకిలి నేడు అందముగ తీర్చరె
మందార మాలలు కెందామరలు తేరె
రంగవల్లులు నేడు సుందరముగ దిద్దరె
కుంకుమ పసుపుల వాకిళ్లనద్దరె

చ॥ కలికి కనుచూపులు గడప తోరణములు
నెలత చిరునగవులు కావ నీరాజనములు
అందియల సవ్వడులు డెందవు అలజడులు
నిలువని పదములు సఖునెద సరిగమలు

దూతిక: అదియె వాసవ సజ్జిక ఆమెగనుడు
సఖుని ఆగమ వేళన సరసవిధుల
కేళి గృహమునె సుందర క్రీడచేసి
విభుని లాలింప వేచిన వినయశీల!

నిష్క్రమణం

**విరహోత్కంఠిత:**

అనేక కార్య వ్యాసంగత యాస్యా యస్యేత న ఆగచ్ఛామి
ప్రియకరః యస్యాన ఆగమన తస్యా దుఃఖార్తా విరహోత్కంఠితా

**నాయిక ప్రవేశం:**

ప॥ వినవటే చెలినేడు వీణియల మూర్ఛనలు
విరహాల వేదనల వేడాయె వెన్నెలలు

అ.ప॥ ఉడురాజు కొలువున ఉసురునెడు తారకలు
గడచేన ఈరేయి విసురుగ గాలులు

చ॥ సఖుడేమొ రాడాయె, అలసేను ఆశలు
విభుడేమొ లేడని వడిలేను జాజులు
పసిడి కిన్నెర మీట పలుకవట రాగాలు
మోవి కెంపులు దాచి ముకుళించె అధరాలు

చ॥ నిట్టూర్పు వేడికే రగిలేను ఎడదలు
ఒట్టుసుమ్మి, అతడు కఠినాత్ముడందునే
కటకటా ఇదియేమి ఈ వింత భావమ్మ
ఇటునటు తోచని ఈ విరహ భారమ్మ

**సూత్రధారి**

అతుల విరహాగ్ని జ్వాలతో నామె అలసె
అతడు వచ్చెది వేళకు అలసిపోయె
విరహ వేదనకోర్వక వెతలు చెందె
విప్రలబ్ధగ ఆయింతి వెడలె నపుడు

**విప్రలబ్ధ**

నేపథ్యం: క్వచిత్పతకేత మావేద్యతత్రనాధేన వంచితా
స్మరార్తా విప్రలబ్ధేతి, కధిధాభావకోవిదై
అస్యాస్తు చేష్టా నిర్వేదశ్చింతా ఖేదోదదీశతా
అశ్రు నిశ్వాస మూర్ఛాద్యాః కధితాభానవేదిభిః

**ప్రవేశం:**

ప॥ ఇదియె చూతము రసాల పాలము
సఖుడు తెల్పిన సంకేత స్థలము

అ.ప.॥ ఏడమ్మ చెలుడు నన్నేలు విభుడు
రాడమ్మ ఇంకను రేయి గడిచేను

చ॥ ఏల జీవమ్ము, వ్యర్థమౌ ప్రాణమ్ము
ప్రియుని చెలిమి నోచని ప్రాయమ్ము
కనుల జారెను ముత్యాల సరాలు
మరచె నేమొ తానిడిన వరాలు

చ॥ కరము కరమున చేర్చి, కలతవలదని
మాపటివేళకు మరలి వత్తునని

పరిపరి విధముల పలికి మురిపించి
మరులు గొల్పి, మరి మరుగాయెనేమి?

ప్రవేశం: సూత్రధారి - నాయకుడు

సూత్ర: న్యాయమాయిది నీవిటు నాయికలను
మదనతాపము బారికి మనికి చెదర
చేయ, భావ్యము కాదయ్య చిత్తభవుడ
వెడలు, లేకున్న ఖండిత వెతల బెట్టు

**ఖండిత ప్రవేశం:**

**నాయకుడు:**

నెమ్మోము దాచేవు నెలత నీవేల?
చిన్నారి కోర్కెల చిన్నబుచ్చెదవు

అ.ప.॥ అటునిటు వెదుకాడ చటుకున దాగేవు
ఇటు నను కోపాన వేధింప చూసేవు

చ॥ దరికి రానీక, దయమాలి విదిలించి
నిట్టూర్పు వేడిలో వడలేవు భామిని
తడవాయె నారాక తప్పులెన్నగ బోకు
తరలి వచ్చిన వేళ తాపాన రగలకు

చ॥ జగతి కార్యముల జాగాయె చెలియ
వినతి వినవేమి నీవాడ నేకాన?
చేయంద, విదిలించ నీకిది న్యాయమా
సఖుడనే నెచ్చెలీ ఒకమారు పలుకవే

**ఖండిత:**

ప॥ చాలు చాలు ఎవరింట దాగేవు సఖుడ
సైపలేను నీమాయ జాలము నేనికం

అ.ప.॥ పరవనిత లాలించ పగలాయె రేయి
కనుపాప నీడనామె కదలాడె నోయి

చ॥ అన్యకాంత దాపున అచ్చెరువులే కాద
విన్నపాల నేనిట నెచ్చెలిని వెదుకాడ
అన్నెపున్నెము లెరుగని నిన్ను విడనాడి
ఎందెందు దాగేవు ఎటనుండి నీ రాక?

చ॥ కనుచూపు మసకాయె కన్నీటి జాలున
నన్నుమోవి వణికేను పరితప్త భావాన
నను మరచి పరకాంత చెంతచేరితివేల
పోపొమ్ము అచటికే నేను నీకేల?

నిష్క్రమణం

ఈర్ష్యా నిష్క్రాంతో యస్యా న ఆగచ్ఛతి
అమర్షవర్షా సంతప్తాః కలహాంతరితాభావేత....

(ప్రవేశం దూతికలు, కలహాంతరిత)

నాయ: కోరి నీదరి చేరితి కోమలాంగి
కోప గృహమున దాగెడు క్రోధమేమి?

అ.ప. సఖులు చూచెడు వేళ, సరసమాడ
విదిలి కొట్టెదవేలనె వింతరీతి?

నాయిక: పోపొమ్ము, నా దరికి రాకు సుమ్ము
కోపాలు రగిలేను ఇక వెడలిపొమ్ము
చరణ చారుడ వని సఖుడ నమ్మితిని
తరుణి నన్నిటు కుపిత చేయకారణము?

చ॥ ప్రణయ రాజ్యము నాది, పట్టమహిషివి నీవు
కరుణ నేలవె నన్నని పలుమారు పల్కి

తరుణ ప్రాయపు నన్ను మాయను పడవేసి
వెడలి పోయిన ప్రియుడ, మరలిరాబోకు పో పొమ్ము...

**నాయకుని నిష్క్రమణం**

**నాయిక చెలులతో**

పరితాప భావాలు పరిపరి విధముల
బాధించెనే నన్ను సేదతీర్చ రారె
అకళంకు డానాధు నన్ని విధములనేను
అవమాన పరచితినయ్యొ్య ననుమన్నించునే?...
నిష్క్రమణం...

ప్రోషిత భర్తృక:

ప॥ చెలులార సఖుడేగె దేశాంతరమ్ము
కలహమాడి నేను కలతలో మునిగేను

అ.ప॥ గురు కార్యమని తాను నను విడిచి ఏగేను
మరలి వచ్చేవరకు నా మనికి నిలుచునే

చ॥ కనుదోయి మూయంగ కదలాడు విభుడు
కురులేమొ సవరించ దరిలేని సఖుడు
పాదాల పారాణి రంగులీనగ లేదు
ఖేదాన గాజులు పలుకనే లేవు

చ॥ ఏల నాకింక ఈ అలంకారములు
ఏల నాకొరకు చందన ధూపములు
రేపు మాపని ఎదురు చూసేను నేను
రేయి గడిచేన ప్రభువు తిరిగి వచ్చేన!

చ॥ దశమి నేడు, ఇంకెపుడు దినము గడిచేను
పున్నమి వెన్నెల్లు మరలి వచ్చేన

భుజమదిరి శుభశకున మాయెనే చెలీ
విభు తలచి నిదురించ కలయందు కాంతునే
నిష్క్రమణం...

**నేపథ్యం:**

హిత్వా లజ్జా సమాయిష్టా మదేక మద్నేన్వా
అభిసారిర్యతే కాంతా సాభవేత అభిసారికా
**ప్రవేశం**

ప॥ సంజెగాలి కబురంపె సఖియ వినవటె
చెలుడువేచె ననుచేర పున్నాగ నీడనె

అ.ప॥ కిసలయము పులకించె తరులతలు వికసించె
విసరి వీవన మలయ పవనుడరుదెంచె

చ॥ దివాభిసారికగ దినమంత తిరుగన్
దినకరుడు లాలింప వనమంత చూడన్
జ్యోత్స్నాభిసారికనై జ్యోతి వెలిగించనా
శ్వేత వస్త్రము దాల్చి వెన్నెలగ వెలుగనా

చ॥ తమోభి సారికనై నీలోత్పలము బూని
నళినాక్షు కందయై నాట్యమాడేన
కస్తూరి జవ్వాది ఘనసారములనలది
శరదిందు హాసాల చక్రి నే చేరనా?

నాయ: పరి పరి విధముల మనసుని గెలిచిన
ప్రణయపు రాశులు వివిధ నాయికలు
రూపము వేరుగ భావము ఒకటిగ
తాపము చెందెడు కాంతామణులు
ప్రకృతి సహజము భిన్న రాగములు
మనసుల కలిగెడు కోప తాపములు

విరహము కలహము జీవన గతులు
శృతి చేసిన సాగెడు మధుర గీతములు
నాయకుడ నే విశ్వనాయకుడను
అష్టవిధ నాయికల నలరించు భావుకుడను
నాయిక ప్రకృతిగ చేకొను పురుషోత్తముడ
సంపూర్ణ జగతిన పరిపూర్ణ పురుషుడ!

ప్రవేశం అందరు నాయికలు

అరుదెంచె నదిగో స్వాధీన పతిక
వెనువెంట తానొచ్చె వాసవ సజ్జిక
విభుని చేరగవేచె విరహోత్కంఠిత
వెన్నుని వెదుకబోయిన విప్రలబ్ధ
విశ్వధరునె బెదిరించు నామె ఖండిత
విన్నపము వినదాయె కలహాంతరిత
పతి తలచి వగచేను ప్రోషిత భర్తృక
ఎదురేగి అర్పితమాయె నభిసారిక

సూత్ర: విశ్వవిభుడ నీవు విశ్వనాయకుడవీవు
పుణ్యమూర్తివి నీవు పురుషోత్తముడీవు
అష్టవిధ నాయికలు ఇష్టసఖులై కొలువ
సృష్టి సలిపిన మనోజ్ఞ స్రష్ట నీవు

మంగళం:

ఉమ తన పలుకుల నుడివెడు కవితలు
శ్రీకరముల మెరసెడు స్వాతి ముత్యములు
రాముని పదముల విరిసెడు సుమములు
సుజనుల మనముల కురిసెడు మధువులు

# రసమయం - రామాయణం

నవరస భరితము రాముని చరితము
ఇనకుల తిలకుని శౌర్యపు కథనము
కరుణయె కరుగగ శాంతము విరియగ
భయ, అద్భుతరస వాహిని పొరలగ
అవనిజ పరిణయ శృంగార మెరయగ
దశరథ తనయుని రౌద్రము రగలగ
జడిసిన కడలియు దారిని విడువగ
యుగములు రాముని విభవము పొగడవ!

కరుణ: కమల నయను పదము కటిక రాతిని సోక
కనులు విప్పెను పడతి అది పుణ్యచరిత
కరున రసవాహినిగ కదలి జారిన వేళ
కరకు రాయి కూడ వెన్న కాద!

శృంగారము (శివధనుర్భంగము)
కనులెత్తి ఆ తరుణి అలవోకగా చూడ
ధనువెత్తి ఆ విభుడు నారిసంధింపగా
భటభటార్భాటమది అవని కంపించగా
తటిల్లత తనువూగ భువినాడు నర్తించె

ధరహాస చంద్రికలు మోమెల్ల నర్తింప
విరబూసె వైదేహి ముఖచంద్రబింబమ్ము
చిరుచెమట లలరంగ శ్రీనాథు నెమ్మొమ్ము
అరవిరియు అలనీలి కలువ చందమ్ము

చేయెత్తి విరిదండ వైదేహి వేయంగ
వేయి తామరలు విరబూసినట్లాయె

రాయంచ నడకలతో రఘువరుని చేరంగ
కోటిసంధ్యల మెరుపు కలబోసినట్లాయె

కలికి కనులవి ప్రణయసరసులు
మొలక నగవులు సీత సొగసులు
విభుని వలపులు రేప పులకలు
ప్రభుని పదముల చేరె తలపులు

హాస్యము

రాము మోహింప ఆ లంకలలన
తాను కాదని తమ్ముచూపె రాఘవుడు
ముకు చెవులు కోసి తరిమేను అనుజుడు
హతవిధీ పరిహాస మాయె తన బ్రతుకు

భయము: (రాముని కేక హా లక్ష్మణా, హా సీతా అని విన్న సీత భయము)

చెంగున దూకెడు బంగరు హరిణము
ఎందున దాగెనొ విభుడెటు ఏగెనో!
ఆపద కల్గెనో ఆర్తిని పొందెనో
లక్ష్మణుడేగునో రక్షణ సేయునో!

నాధుడు లేడని రాక్షస వీరులు
నాదరి చేరగ ఏ గతి కూడునొ

హే విధీ, నా నాథుడేమాయెనేమొ
సౌమిత్రి మనసున కౌటిల్య మెగసెనో
పతి లేని నను తానె కోరునేమొ
పది తలల రావణుడె హరియించునేమొ!

బీభత్సము: లంకాదహనము

పెరకెను చేతులు కదళీ ఫలములు
మిగులను పండిన చూతపు రసములు

వనమది భీకర రణముగ మార్చెను
రక్షక భటులను త్రొక్కిడి కూల్చెను

వాలము చిచ్చుగ లంకను కాల్చెను
హాహాకారములంటె లంకను
రావణ మనమున భీతిరగిల్చెను
'చూచిరమ్మన' కాల్చి వచ్చెను.

**రౌద్రము: రాముడు సముద్రునితో**

కోలతాకిన నీవు నేలగ మారంగ
సాగరా నీకింక నెలవు ఏది?
కోదండ పాణియై క్రోధమున నే చూడ
ఆవిరైపోవ నీవు అవనియందు!

**రావణుడు యుద్ధమందు**

కార్చిచ్చు రగిలె నా హృదయమందు
చితి పేర్చి దహియింప సుతుల హితుల
రాముని నామమె ఇలసమసిపోవ
కాలునివలె సమరాన చెలగిపోన!!

**అద్భుతము: వారధి నిర్మాణము**

కడలి నిడిన కరకు రాలు
మునగ వేమిది మర్మమేమి?
కపివరులు కరము చేర్చగ
వెలసె వారధి అద్భుతముగ
ఆదిలక్ష్మి అశోక వనమున
ఆది పురుషుని చేరకోర
అవనియందిక అద్భుతములు
జరుగ వింతయె కపి వరేణ్య!

**శోకరసము: రాముడు ముద్రిక నిడి...**

హనుమ ఇదియె గురుతు గొనుము
సుదతి సీత జాడ గనుమ
వెదకి వెదకి అలసె కనులు
కలికి బాసి వడలె బ్రతుకు
విడచి జానకి మనగ లేనిక
వెతకి మాతను కబురు తెమ్ము

**శాంతము: అంగద రాయబారము**

వెలుగుల దొరయది మొయిలుతో కలిసెను
శిరమున జడయది మునివరు పోలెను
శరమును దాల్చిన భుజమది ఘనముగ
ఉరమున వెలసిన నిజసతి చేరగ

శాంతచిత్తుడు ధర్మశాలియు
రణము వలదని రఘుకులేశుడు
అధర్మపరుడగు అసురవీరుతో
సంధి చేయుమని అంగదు పంపెను.

**వీరము:**

కదలెను మేరువు నగమది అదరగ
కదలెను ఈ భువి దడ గడ వణకగ
కదలెను భూసుత మనసతి అదరగ
కదలెను రాముడు కుడిభుజ మదరగ
ముల్లోకములవి చకితము కాగా
కల్లోలముగ రణమదిరేగా
రామరావణ భీకరయుద్ధము
చరిత పుటలలో నిలుచును తథ్యము

రసమయ కథనము రామాయణము
నరుడుగ వెలసిన నారాయణుడు
నడచిన బాటయె ధర్మగాథయై
దనుజుల గెలిచిన మనుజుని కథయై

నవరస ఝరులవి బ్రతుకుల నిండగ
సత్యము ధర్మము అవనిలో వెలయగ
శాంతము రూపము దాల్చిన రాముడు
పురుషోత్తముడైన పుడమిని నిలువగ!

శాంతము శోకము కరుణ హాస్యములు
భయ అద్భుత బీభత్స రసములు
కలసి సాగును జీవన గతులు
నవరసములె విశ్వశాంతికి శ్రుతులు

మంగళం

ఉమ తన పలుకుల నుడివెడి కవతలు
శ్రీకరముల స్వాతి ముత్యములు
రాముని పదముల విరిసెడి సుమములు
సుజనుల మనముల కురిసెడి మధువులు

# సత్యభామా విజయం

**సీన్ - 1:** నరకాసుర ప్రవేశం

ప॥ ప్రాగ్జోతిషపుర ప్రాణాధిపతి నేను
ప్రాక్పశ్చిములేలు చండ మార్తాండుడను

అ.ప॥ నరకుడను నామము, కరకు శిలల క్రౌర్యము
సురవరులు వణికేటి అతిఘన శౌర్యము
కర్కశ క్రౌర్యాన చెలగేటి నరకుడను

చర॥ దితిసుతులు, పురనరులు గంధర్వ కిన్నెరలు
ప్రతిదినము నను కొలువ త్వరగ పరుగిడును
పసినిసుగు లులికిపడు పడతులు తడబడును
పురవీధి నేవెడల తిమిరములు ముసురుకొను

వెడలెద విరించి కొలువగ నేడిటు
అడిగెద వరముల జగమును గెలువ
మర్త్యలోకమందు మృత్యువే లేకుండ
ధీరులెవ్వరు ననుదునుమకుండ!

**అటుల పలికె, అంత నరకాసురుడు బ్రహ్మదేవుని గూర్చి తపము కొరకు వెడలె:**

ఓం బ్రహ్మదేవాయ నమః ఓం పరబ్రహ్మణే నమః

విధి విధానమెరుగు విధాతవీవు
విధిగ దీవింప నిను వేడినాను
కరుణ చూడవె నన్ను కమలాసన
కదలి రమ్ము నను కావగాను
కోరి చేరితి నీదరి వేదముఖుడ
నేర మెన్నక నాకు వరములొసుగు
భువిన ననుగెల్చు పురుషుడెవడు
లేకుండ దీవింపు పద్మభవుడ!

బ్రహ్మ సాక్షాత్కారము

తే.గీ. అసుర, మెచ్చితి నీదగు అతుల తపము
ఒసగ వరమది నేనిటు ఒప్పుగాదు
నీకు మృత్యువు తప్పుట నిజము కాదు
కాని గెల్తువు జగముల కదన భూమి!

**అతుల వరము బడసి, నిజపురమునకేగిన నరకుడు, తన రాజ్యమందలి మునులు, బ్రాహ్మణులు, వనితలను హింసించిన విధానంబెట్టిదనిన...**

ప॥ కమలభవుని కరుణ బడసి
సురల, విపుల నణచి, దునిమి
భువనమేలు విభుడగాన
సకల జనుల ప్రభుడగాన

చర॥ విష్ణుడెవడు, జిష్ణుడెవడు?
నాకెదురగు ధూర్తుడెవ్వడు?
క్రతువు కాదు హితము నాకు
కొలువ నేనె వేల్పు మీకు!

చర॥ వనిత లందరు నాదు స్వంతము
ఎదురు పల్కిన మృతి తథ్యము
రాజు నేనె ఈ పుర రేరాజు నేనె
కన్నెలందర నాకు కాన్క నీయరె!

చ॥ మునులు గినులు సమసిపోర
ఋషులు గిషులు మసిగ మార
పుర ప్రభువు నేనె కాద

**మునులు:**

తే.గీ. తాళజాలము ఈ విధి దయను మాలి
రాజు చేసెడి ఘాతక రాజ విధులు

శరణు వేడగ ద్వారకాపురము జేరి
మనవి వినిపించెదము నేడ మాధవునకు

**సత్యభామ ప్రవేశం:**

ప॥ సాత్రాజితిని నేను సత్యభామను నేను
యదువంశ సోమాంబుధి శశిని నేను

అ.ప. సారసాక్షు చెలిమి దోచితినిగాద
కానలేని సౌందర్య రాశినేగాదా
అష్టమహిషులందు, ఇష్టసఖినేగాన
పట్టమహిషిని మించు పడితినేగాన

సాత్రాజితిని నేను సత్యభామను నేను
యదువంశ సోమాంబుధి శశిని నేను

నాదు కనుసైగలందు
దాచుకొంటి కమలనాభు
నాదు చిరునగవులందు
చేర్చుకొంటి చిద్విలాసు!

**దూతికతో:**

సఖియ ఒక పరి ఇప్పుడె వెడలుము
సఖుని వేగమె తోడి తెమ్ము
సత్యభామిటు పిలచెననుమా
క్షణమ్మొక యుగ మాయెననుము

పొమ్ము పొమ్మిక తాళ జాలను
లిప్త కాలము ఓప జాలను
మాధవుని రాకయె శమనము
మనవినిక మన్నింపమనుము

**దూతిక నిష్క్రమణం**

**రుక్మిణీ మందిరం: గోపాలకృష్ణుడు విశ్రమించిన విధంబెట్టిదనిన...**

**రుక్మిణి**

సేద తీరగ స్వామి శయనించు నేడు
విశ్వ నిలయుడ వీవు అలసితివి కాబోలు
పదునాల్గు లోకములు పాలించు స్వామి
పలుమార్లు భక్తులను బ్రోచేటి స్వామి

చర॥ తులసీ దళములతో మాలికల నల్లితిని
విరిసీ విరియని వకుళములు చేర్చితిని
పరిమళాన్విత చందనము అలదితిని
మిసిమి తలపులూర కుసుమముల కూర్చితిని

చర॥ విదర్భ పుత్రికను వినతి చేసెదను
శ్రీధరుడ కాసింత విశ్రాంతి గొనుము
బాధితుల కాచి నీవు బడలితివి స్వామి
ఒక్కింత పవళించి, మనవి ఆలింపుము

**కృష్ణుడు**

వినయశీలవె నీవు విదర్భపుత్రి
విన్నపము లేలనె వెన్నుని శాసింపు
నీ ప్రేమ బంధాల ననుకొలుచుదేవి
నీ భక్తి భావాలు మధురస వాహినులు

రాణులందరిలోన రారాణి వీవు
రుక్మిణీ సతి యన్న కృష్ణునికి జీవమ్ము
జన్మజన్మల బంధము మనది ఓ చెలీ
పుణ్యశీలవు నీవు, అగ్రగణ్యవు నెచ్చెలీ

ఇంతలో దూతిక ప్రవేశం:

తే.గీ.　స్వామి తెచ్చితి వార్తను సత్యభామ
పలుకునొక్కటి మీకిట తెలుపుమనెను
వేగ రమ్మని ఎంతయు వేడుకొనుచు
మనవి పంపెను నా తోడ మరల మరల!

కృష్ణుడు:

ఏమి కారణమేమొ ఇంత బాధ
మనసు నొచ్చెనొ లేకున్న మానవతికి
ఇంత ఆతృత యేలనో ఇంతికిపుడు
ఇదియె వచ్చెద తెలుపుము ఇందువదన

రుక్మిణి:

మురళీ మోహన నీ విరహమెపుడు
సహనమగుట సత్యకు సాధ్యమగున?
రెప్పపాటు కనుమరుగు కాబోవు నీవు
ఒప్పునే తాను ఎప్పుడయిన??
తాళ జాలదు తన్వి నీ వియోగము
వేగ పోకున్న తథ్యము కలహకారణము
కాన వెడలు జగన్నాటక సూత్రధారి
కానున్న ఘటనలు చరిత నిలువ!

సత్యభామ మందిరం

కృష్ణుడు:

తరలి వచ్చితి నేను తరుణి ఇపుడు
మనవి తెచ్చిన దూతిక మాట వింటిని
తెలుపు ఏమది కారణమింత వేదన
లలన పలుకు ఏమిటి తాప మిపుడు?

పున్నమి చంద్రిక పలికెను ఏమని
కన్నుల కాటుక కరగేను ఏలది?
వెన్నెల మోమున నీడలు ఏలనె
వన్నెల మోవిన నవ్వులు ఎక్కడె?

సత్యభామ:

చాలిక పలుకులు చతురపు మాటలు
కలికిని వదిలిన కపటపు మాటలు
నమ్మితి నిన్నని చులకన సేయకు
వెన్నుడ పొమ్మిక వచ్చిన చోటుకు

పట్టపురాణి రుక్మిణి కాద
మెట్టిన మమ్ముల ఇట్టుల చూతవ
వేచిన కరిగెను వెన్నెల రాత్రులు
వేదన కలిగెను పున్నమి వేళలు

నా సరి సొగసులు వెదకిన కానవు
సరసపు చెలువము అతులిత స్నేహము
కలిపిన భామను కూరిమి చెలియను
చేరగ కోరిన మోహన రూపము!

కృష్ణుడు:

తరుణి నీ మాట నేదైన దాటగలనె
ధరణి కృష్ణుడు భామకు దాసుడనరె
మగువ మోమటు త్రిప్పియు మారు పలుక
విరహ బాధను తాళని విభుని గనవె!

సత్యభామ:

నీలమోహన నీదు మాటలకు కరిగతి
కాలహరణ మ్మేలన కమలనయన

చెంగలువ వికసింప శరదిండువదన
చేరబోవగ రారా చక్రధరుడ!

వాకిళ్ల నలరేను వెలుగు తోరణము
చెక్కిళ్ల నలదేను పూల పరాగము
మురళి మ్రోగిన వేళ నర్తించె జగము
సరస చేరిన వేళ వికసించె మనము

డోలల నూగేను డెందమ్ము నేడు
గాలుల సాగేను సుమగంధము చూడు
కాళింది మర్దనము చేసిన ఘనుడ
లాలించి లలనను పాలింపరార!

**అంతఃపురము బయట కోలాహలము**

**మునులు బ్రాహ్మణులు**

పాహిపాహి జనార్దన, పాహిప్రభో కృష్ణా,
మధుసూదనా మమ్ము కావవయ్య

**కృష్ణుడు దూతికతో ఏమది ఈ ఆర్తనాదమ్మెటనుండి? ఈ అలజడి ఏమి? ఆ దుఃఖార్తులనిపుడె ప్రవేశపెట్టుము...**

**మునులు:**

కరుణించి కాపాడు కమలనయన
నరకుని హింసలు దుస్సహమాయె
క్రతువు సేయగ లేము ఒక్క
హితము కూర్చగ లేము॥

ద్విజులన్న ద్వేషము
క్రతువన్న క్రోధము
బ్రతుకనీడు రాజు
బ్రతుకలేమిక మేము.

పరసతులు, పతివ్రతలు
కోడళ్లు, కూతుళ్లు
ప్రాణములు మానములు
దక్కని అబలలు
హోరుమని శోకింప
భూతలము వణికేను
కావగ రావయ్య కారుణ్యధామ

కృష్ణుడు:

కారణమేమిది
తాపసులార సాత్వికులా
ఒకింత తాళురు, ఓర్పునుపూనియు
ఒక్కొక్కరుగ వినతులు తెలుపరె

భూదేవి

తల్లినయ్యును నేనిక తాళకుంటి
నరకు చేసెడి ఘాతక నాటకములు
అబలయన్నది ఆతని ఆట బొమ్మ
ఆమె చెంతనే జీవిత మంతమగును.

శాపమిచ్చితి నయ్యు శౌరి వినుము
తాపమోపగ లేక ధరణి నేను
భగదత్తుని కాచు బాధ్యతెరిగి
పల్కితిటుల నరకు నాశమునకు

కొనసాగింపు నీవె జగన్నాటకమ్ము
వేచి నీ కృప చూడ వేడుచుంటి
నాదు అంశ సత్యభామ రూపాన
నీకు తోడుగ సాగు లీల చక్రధారి!

మునులు:

నరకుని బాధలు కర్కశ గాథలు
తాళగ జాలము శరణము వేడను
తరలి వచ్చితిమి, దనుజుని దునుమను
వేగమె రమ్మో యదుకులభూషణ!

నరకుడు ధూర్తుడు
వరముల బడసిన
రాక్షస వీరుడు
మగువల బాధలు
తెలుపగ లేమిక
పయనము సేయర
పన్నగ శయన ॥

కృష్ణుడు: వచనం: అటులె వచ్చెదను మీరు మరలిపొండు.

సమయమాయెను సమర భూమికి
శమన మందగ భూమిసురలు
తరలి వచ్చెద నిపుడె పోరుకు
నరకు దునిమెద శుభము కలుగ
శాంతి నొందుడు సుజనులారా
క్రాంతి వలదిక ఒజ్జలార
చక్రధారిగ నేను చెలగ
వక్ర జీవులు సమసిపోర!

మునుల నిష్క్రమణం

సత్యభామ:

మనవి నాదొకటి విను మధుసూదనా
చెలిమి తోడను పల్కెద చిద్విలాస

సమర భూమికి నీతోడు వెడల
మనసు కోరెను మన్నింపు దేవ!

సాత్రాజితిని నేను సాహసము నా సొత్తు
రాక్షసుని దునుమాడ మనసాయె స్వామి
పోరు వలదన్నచో, రథసారథిని యై
నీ తోడు నీడగ నే కదలిరాన!

తండ్రి పెంచిన శౌర్యము తనువున అలరార
శౌరి సతిగ నే వెలుగొంద మనసాయె
మురహరా నన్నింక నీ తోడు గొనిపొమ్ము
నరకు వధియించి ఇలను కీర్తి బడయ

కృష్ణుడు:

వెన్నెల పూలను మాలగ చేసి
వెన్నుని దోచిన కన్నెవు నీవు
దుష్టులు చేరెడి రణరంగము
కష్టము నిండిన కార్యభారము

ఇంతి, నీవు విరిసిన పూబంతివి
పంతమేల నాతో వంతులేల
కొంత తడవు నీవింట వేచితేని
సుంతలో తరలి రాన సుదతి నేను??

సత్యభామ:

కాదు, కాదన బోకుమో కమలనాభ
తోడుకొని పొమ్మునే వేగ తడవదేల
రక్కసునిద్రుంప చేసెద రణముతోడ
నరకు నాశమొంద దౌష్ట్యమ్ము లీతరిన్

రథము కూర్చెద రారమ్ము వారిజాక్ష
సారథి నీవుగ సాగెదము రణధీర
ఎదురు నిల్చుట అసురకదె శిక్ష
నీవు నేను తోడైన అవనికే రక్ష!

వచనం: అటుల పల్కి సాగిరి సత్యాకృష్ణులు. ఎదురుగ రణభూమి యందు నరకాసురుడు ప్రజ్వరిల్లిన విధంబెట్టిదనిన...

నరకాసరుడు:

రారమ్ము వేచితి వాసుదేవ
గోపమ్ము సరసాలు కావనితెల్ప
రణమన్న రాసలీల కాదు గోపాల
దేవేరితో నేగ ఇది ఏమి హేల?

ఆలమందల కాచు అరివీరశూరుడ
నీలమేఘము బోలు యాదువుండ
వెన్నమీగడ కాదు అసుర సంహరణ
కన్నతల్లి చాటుకాదు కదనరంగమున!

పోపొమ్ము, ప్రాణమ్ము కాచుకొమ్ము
రాక్షసులతో పోరు ప్రాణసంకటమ్ము
మరియాద మాటగ మరలిపొమ్ము
మగువ సరసాల తేలిపొమ్ము!!

కృష్ణుడు:

అసుర నీకిదె తుది మాట ఆలింపునేడు
అబల రక్షణ లేని ధూర్త రాజ్యము వీడు
అతివ శాపాలు నిను విగత ప్రాణిని చేయు
హితము తెల్పితి నన్నిప్పుడె శరణుకోరు

పుడమి నేలెడు రాజు పుణ్య పురుషుడు కాద
పడతి బాధలు పడగ, పృథివి శపించద
మునులు విప్రులు సుఖము పడని తావు
ఈ భువిని వెలసిన నరకమ్మె కాద!

**నరకాసురుడు**

చాలు చాలింక నీతులు గొల్లవాడ
పోరు సల్పగ వచ్చి వాదులాడనేల
బోధమాని సంధింపు నీ శస్త్రమిపుడు
కాచుకొను నాదగు ఘాతములను...

**యుద్ధం. జతులు మృదంగం...**

**నరకాసురుని శరము తగిలి కృష్ణుడు మూర్ఛిల్లును... విజయగర్వాన నరకాసురుడు అహంకరించినవేళ, సత్యభామ పోరుసల్పిన విధంబెట్టిదనిన**

**సత్యభామ:**

నాదు స్వామి మూర్ఛిల్లెనని మురిసిపోకు
పోరు సల్పెద నీ ప్రాణము పణముగాను
నారి సంధించిన నే నపర శక్తిని కాన
నాదు క్రోధాన నీవు భస్మమ్ము కావ!

**అంతలో సేదదీరిన చక్రి, రణమున అలసిన సత్యభామను చూసి ప్రేమాతిశయంబున ఇట్లనియె....**

ఫాలభాగాన స్వేదబిందువు లలర
సాధ్వి నీ మోము పద్మరాగ శోభితమాయె
ఉదయ సంధ్య అలదిన తుహినకణముల
శోభిల్లు జలజంపు చెలువమాయె

విరజాజి తాకిడికె కందు నీ సోయగము
శర ఘాతముల నింకెంత సొలసిపోయె

దుస్సహ దానవ మర్దనమున
డస్సిపోతివి సఖీ ఒకింత విశ్రమింపు

చక్రధారినై నేనిటు ప్రజ్వరిల్లి
దునిమి వైచెద దుష్ట నరకునిపుడు
చెదరగ దానవ దుష్కర్మలు
వెలయగ భువిని సుఖశాంతులు

నరకు పుత్రు భగదత్తుడు రాజుకాగ
పుడమి తల్లి మనసు పొల్కడలికాద
అభయమిచ్చితి దైత్యుని వారసునకు
భయము తీరగ చరాచర జీవులకు

సాత్రాజితిని నేను సత్యభామను నేను
సాక్షాత్తు భగవాను నర్ధాంగి నేను
నరకాసుర నీకు నరకమ్మె ప్రాప్తి
భూతలము పొగడంగ నాదు కీర్తి!
యుద్ధం....

**అందరు:**

తిమిరములు చెదరగ
భువనములు కొలువగ
వెలిగేను దివ్వెలు
తరుణుల నవ్వులు
నరక చతుర్దశి గడిచెను
అమవస వచ్చేను
మురారి నవ్వుల
దీపాలు వెలిగేను
నరకుని వధయే
సత్యా విజయమై

తరతరాలు చరిను
ఘనముగ నిలిచెను

మంగళం:

ఉమ తన పలుకుల నుడివెడు కవితలు
శ్రీకరముల మెరసెడు స్వాతి ముత్యములు
రాముని పదముల విరిసెడు సుమములు
సుజనుల మనముల కురిసెడు మధువులు

# నమామి సతతం
# లాస్యలలితం!!

**లలితాదేవి ప్రవేశం:**

ఝణఝణ నూపుర ధ్వానములు రేగ
కణకణ కింకిణీ నాదములు మ్రోగ
అరుదెంచితి నేను అమర బాలను నేను
త్రిపుర సుందరి నేను లలితమూర్తిని నేను

బాలార్క బింబంపు చెలువంబు తోడ
మధ్యాహ్న మార్తాండు తేజంబు తోడ
ఆనంద లాస్యాల ఆహార్యముతోడ
కెంజాయ కెంపుల అంతాల తోడ

షోడశ కళలున్న పూర్ణేందు బింబమై
వెలిగేటి మోమున్న వెలది నేను
అళిరాజు దాగేటి నీలికుంతలముల
మేఘాల దోగాడు రాకాశశిని నేను

తాపసులు కొలిచేటి త్రిపురసుందరి నేను
తామసము తొలగించు దివ్యజ్యోతిని నేను
కామేశు కాంక్షించు కన్యకుమారి నేను
సాత్వికులు కోరేటి సాకార రూపిణి నేను.

**దేవతలు, మునులు**

పాహిపాహి జగన్మాతా
పాహిపాహి జగద్ధాతా
పాహిపాహి పరాశక్తి
పాహిపాహి ఆదిశక్తి

శరణుకోరి వచ్చితిమి
కరుణ చూపి కాపాడవె
అసుర బాధలు మితముమీరె
మసల లేమిక సుంఖము లేక

**లలిత:**

వైన మేమది సుజనులార
వ్యథలు ఏలవి వినయశీలుర
అశాంతి పొందుటకేది హేతువు
ప్రశాంతి లేదిట చేయ క్రతువు!

మునుల మోములు చిన్నబోయెను
ధరణి భారము అమితమాయెను
సిగ్గు చెందక తెలుపరండి
ఎగ్గు కలిగిన కలత ఏమది?

**మునులు:**

తల్లి నీవని చేరవచ్చితిమి
కల్ల సేయక కరుణ చూపవె
భండనాముడు దనుజుడొకడు
చండ మార్తాండుడై చెలగినాడు

ఒసగె వరము భవుడు తపము మెచ్చి
సలిపె హింస జగతి అసురుడిపుడు
ఎదురు నిల్వగ సురలు జడిసిపోగ
చెలగె నతడు శివుని వరముబడసి
కదలిరావమ్మ కరుణామూర్తి
కొలువ నీవిట నిలిపి నీదు కీర్తి
చేరి నిలిచేము మ్రోల ఆదిశక్తి
దయ చేయవె మాకు భుక్తిముక్తి

**లలిత:**

చాలు, తెలిసెను నాకిక జరుగు గాథ
అభయమిచ్చితి స్వాస్థ్యులై అరుగుడింక
తల్లినేగాన, మీరల తపన తెలియ
తరలి వచ్చెద రాక్షసవరులదునుమ

**ధన్యోస్మిమాత! (మునుల నిష్క్రమణం)**

**భండాసుర ప్రవేశం:**

భండుడ నేను అతి ప్రచండుడ నేను
అఖండ భూ మండలము అదరంగ
అరుదెంచు చండ మార్తాండుడ నేను
విజృంభ ప్రభంజన సమవీరుండ నేను

శంభుని మెప్పించి వరము బడసి
ఇంద్రుని గెల్వంగ ఏగినాను
డెందము లదరంగ సురలు నరులు
అందరు జడిసేటి భండాసురుడ నేను

శివుని కరుణ తోడ చెలరేగ నేను
బ్రహ్మ పలికె గాథ భండుడవమని
లెక్కింప నేనిక ఏ అమర వీరుని
దక్కద నాకింక దేవేంద్ర పదవి

**మునులతో:**

తాపసులార నా మాట వినరండి
తామసమున వేవేగ తొలగిపొండి
ఎదురాడ ఎవడైన దునిమి వేసెదను
మాటాడక నా తోవకెదురు రాకండి
నాకలోకమునకు నేనె రారాజును
దేవేంద్ర సతి నాకు కప్పముగతెండు

శచిగూడి దేవేంద్ర భోగముల బడయ
ఎదురెవడు నాకిక మూడు లోకములందు?

**మునులు, దేవతలు లలితాదేవితో**

ముగురు వేల్పుల మూలశక్తి
మూడు లోకాల నేలు శక్తి
కదలి రావమ్మ కరుణామూర్తి
భండు నాశమ్ము సలుపగాను

శచిని కోరె ధూర్తుడతడు
ఇంద్ర పదవి దోచు నీచుడతడు
లేదు సురలకు క్షేమ మెచట
బ్రోవ రావగ తరలు భవాని నేడు!

విఘ్న యంత్రము రచించు విజ్ఞడతడు
విఘ్నేశు సృష్టింప రమణి కదులు
కపర్ది కరుణ చూడ కాత్యాయని వేగ
కారుణ్యమూర్తివై కదలిరమ్మ

**కామేశ్వర ప్రవేశం**

పల్లవి: పాలనేత్రుడ నేను సదాశివుడ నేను
బాలచంద్రుడు వెలయు జటాధరుడ నేను

అ.ప. తాండవ లాస్యకేళి గగనాల నడయాడ
ప్రాంగణమున నినదించు ప్రణవనాదము నేను

చ. సాకారుడను నేను నిరాకారుడ నేను
ఓంకార రూపాన చెలగేటి శివుడను
ఆది అంతము లేని అనంతుడ నేను
మోద ఖేదము లేని నిరహంకారి నేను

చ.	జనన మరణము లేని జగత్పతి నేను
వసన వలితము లేని జంగముడ నేను
ఫణుల భూషణములలరు పశుపతి నేను
అణువణువు ప్రణవమౌ పరమశివుడు నేను

**లలితాదేవి ప్రవేశం:**

లావణ్యరేఖలు ప్రోవు చేయంగ
కారుణ్య మొప్పగు కాంత నేను
రాగలహరుల దేలు మోహనమూర్తియై
రాజిల్లు లలితాంబికను నేను

చ.	నీలోత్పలముల బోలు కన్నులరమోడ్చ
నీలిగగనపు జాబిల్లి నిలిచి చూచేన
మదను ధనువు బోలు కనుబొమలు కదలింప
అళిరాజు అచ్చెరువున అటులె నిలిచేన!

చ.	పసిడి సంపెంగ బోలు నాసిక మెరయంగ
మిసిమి అందాలు మిలమిలలాడేన
నునుసిగ్గు లలర చెక్కిళ్ల అరుణిమలు
ఉదయ సంధ్యకు గిలిగింత లిడెన!

**ప్రవేశం కామేశుడు:**

మలయమారుత మేదో పలుకరించినటులు
చెలియ చేరువ కాగ తనువు పులకించె
గగన తారలు జారి తళుకు లాడినటుల
మెరయు కనుల చూపు నను నిలవరించె.

లలిత లవంగ లతల బోలు బాహువులు
చలిత హరిణ బాలల వింత సోయగములు
కదలు మీనుల అందము దోచు వాలుకనులు
కలికి నీ సొగసు నన్నిటు సంసారి చేయునె!

**లలిత:**

నిను చూడ నా స్వామి తనువు పులకించె
నిను కలియ నా మనసు మరులు గొనియె
కనులెత్తి కామేశ మన చూపు కలియంగ
ప్రభవించె నదె చూడు విఘ్నేశుడె తాను!!

**లలితా కామేశుల నిష్క్రమణం - తెరచాటు నుండి విఘ్నేశ ప్రవేశం**

**స్తోత్రం**

జయజయ గణేశ
పాహి ఘన విఘ్నేశ
పరమేష్టి కనుచూపు
లలితాంబనుగూడ
ప్రభవించిన త్రినేత్ర
అసురు భండుని గూల్చ
అవతరించిన వేల్ప
అవని శాంతిని నిల్ప
అరుదెంచిన సంకల్ప
విఘ్న యంత్రము గూల్చి
విశ్వశాంతి కల్పించి
జగదంబ కరుణతో
జగము లేలగ రారా!

**యుద్ధం: త్రినేత్రుడయిన విఘ్నేశ్వరుడు భండాసురుని, అనుచరులను వధించుట.**

**ప్రవేశం కామేశుడు, లలితాంబ, మునులు దేవతలు**

"శ్రీ విద్యాం జగతాం ధాత్రీం, స్వర్గస్థితి లయేశ్వరీమ్
నమామి లలితా నిత్యాం మహా త్రిపుర సుందరీమ్"

బృందం

పల్లవి: మణి పురవాసిని మాణిక్యవల్లి
మన్నింపవే మమ్ము మాత భవాని

అ.ప. శ్రీపురవాసిని, శ్రీ చక్రాసని
శివశక్తి రూపిణి త్రిపుర సుందరి

చ. ఓం ఐం హ్రీం క్రీం బీజాక్షరీ
ఓంకార రూపిణి మహేశ్వరీ
కామేశ ప్రణయా లోక సుందరీ
త్రిలోక వందినీ, కామేశ్వరీ

చ. భండాసుర మర్దిని చాముండేశ్వరీ
బ్రహ్మాండ పాలిని రాజరాజేశ్వరి
ప్రచండ మార్తాండ తేజోరాశి
అఖండ పూరిణి శ్రీ భువనేశ్వరి

మంగళం

ఉమ తన పలుకుల నుడివెడి కవితలు
శ్రీకరముల మెరిసెడి స్వాతిముత్యములు
రాముని పదముల విరిసెడి సుమములు
సుజనుల మనముల కురిసెడి మధువులు



# మన్మథ జననం

**లక్ష్మీదేవి:**

పాల్కడలి మథియింప ప్రభవించితిన కాన
పాల్గారు చెక్కిళ్ల పడతినే కాన
అళిరాజు దాగేటి వాల్జడల సొంపులు
నళినాక్షు తలపుల నునుమోవి కెంపులు

గగనాల నీలిమలు మేలిముసుగై జార
మెరిసేన తారకలు తళుకులింపార
చంద్రికల సొగసులు పలువరుసలో దాగ
ఉడురాజునకు నే నునుగు సోదరికాన!

వాల్గనుల చూపులు వాడైన తూపులు
కల్హార ముకుళములు కావ నేత్రాలు
మృదు కపోలములరవిరియు జాజులు
తరుణ ప్రాయ శోభలు వసంత చూతాలు!

**విష్ణువు:**

నీలమేఘుడనె చెలీ, నిరాకారుడ నేను
ఆలమందల కాచేటి గోపాలబాలుడను
ఆదిశేషువు తల్పముగ అలరారు విష్ణువును
ఆది అంతము లేని ఆదినారాయణుడ నేను

క్షీరాబ్ధి కన్యకవు శ్రీలక్ష్మి నీవు
క్షీరాబ్ధి శయనుడ శ్రీకరుడ నేను
ఉరమున నిలచి నను ధన్యు చేయంగ
కదలి రమ్మిక నీవు కమలలోచని నేడు!

తే.గీ. అతని చేయంద కదిలెను ఆదిలక్ష్మి
భువన మోహనమా యనన్ భూరి సుతులు

పాల కడలియె వేదికై పరిఢవిల్ల
జరిగె కళ్యాణ వేడుక జగతి మురియ!

శ్రీహరి: శరదిందు హాసాల పులకింపజేసేవు
అరవింద నయన, అరమరికలేల?
రాకేందు బింబమన రాజిల్లు నీ మోము
మకరందము చిల్కి మధుపమై రాన!

శ్రీదేవి: నునుసిగ్గు ననుదోచె నీల నీరదశ్యామ
కనుదోయి కలవంగ మొలకెత్తె ప్రేమ
చటుకున చేయిజాచ చెమరించెమేను
ఎటులను నీ ఎదుట నిలచేను నేను?

శ్రీహరి: చూపు చూపు కలిసిన వెలసేను వారధి
నీలోత్పలము విరిసె, నిను చేరి క్షీరాబ్ధి
పద్మరాగము కాద పడతి నీ నెమ్మోము
పద్మనాభుడ నేను పరవశించగను!

శ్రీదేవి: నీలమోహన నీవిటుల ననుచూడ
నయనాలు నాకేమొ అరమోడ్పులాయె
ప్రణయ భావాన, అభవ, నినుకాంచ
మదనుడె జనియించె మనకనుల కలయిక!

అటుల రూపము దాల్చెను అనంగుడపుడు
వారి జాసను కనుజుడై, వారి ప్రేమ
రూపునొందగ, ప్రణయరాశి యనగ
మదన నామము నొందిల మహిమతోడ!

# శ్రీకరము స్వాతిముత్యాలు



డా॥ ఉమ శ్రీ సగరం కాశీపతి రావు శ్రీమతి వెంకట రమణమ్మల ఐదవ కుమార్తె. హైదరాబాద్ లోని మాడపాటి హనుమంతరావు బాలికల పాఠశాలలో హైస్కూల్ విద్యాభ్యాసం. ఉస్మానియా మెడికల్ కాలేజీలో యం.బి.బి.యస్. తరువాత ఇ.యన్.టి.లో యం.యస్.

భర్త డా॥ రామానుజం, U.S.A. లో ఫ్లారిడాలో జనరల్ సర్జన్.

డా॥ ఉమ ENT Specialist

సంతానం : బి. శ్రీకర్, బి. స్వాతి

అమెరికాలోని కొన్ని ప్రతిష్టాత్మకమైన సేవా సంస్థలలో బాధ్యతా యుతమైన అనేక పదవులు నిర్వహిస్తూ సాంఘిక సేవలో పాలు పంచుకుంటున్నారు.

ముద్రిత రచనలు : 'తుహిన కణాలు' 'గాలిపల్లకి' మరియు 'తలిరాకులు'

అమెరికాలో 'Authorhouse Publications'
English Novel ' I want my son back' A mother's cry